సాక్షి
అన్నమయ్య జిల్లా
ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024



వైఎస్సార్‌సీపీలో చేరిన యువకులు

ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులైన పలువురు యువకులు ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. - 8లో



నిత్యం ప్రజల్లోనే ఉన్నాం..

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉన్నామని, మరోసారి ఎంపీగా తనను ఎమ్మెల్యేగా కొరముట్ల శ్రీనివాసులను గెలిపించాలని పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కోరారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.200
రెండోరకం	రూ.100	రూ.150

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 234 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	411	411
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 47.780 కిలోలు



ఆమోద యోగ్యంగా.. ఆచరణ సాధ్యంగా..

వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో 2024



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శనివారం విడుదల చేసిన మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. సంక్షేమ పాలనను యథావిధిగా కొనసాగిస్తామని అన్ని వర్గాల ప్రజలకు మరోసారి భరోసా ఇచ్చారు. ఇప్పటికే సంక్షేమ పథకాల అమలులో మన రాష్ట్రం దేశంలోని మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. ఈ నేపథ్యంలో తాజాగా విడుదలైన మేనిఫెస్టో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై ప్రజలకు మరింత నమ్మకాన్ని పెంచింది. ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా అన్ని వర్గాలకు సముచితమైన సుపరిపాలనను అందించే సత్తా కేవలం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే ఉందని వివిధ వర్గాల ప్రజలు, కార్మికులు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు, రైతులు తదితరులు తమ మనోగతాన్ని వెల్లడిస్తున్నారు. ఈ మేనిఫెస్టో అన్ని వర్గాల వారిని సంతృప్తి పరిచేలా ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మేనిఫెస్టోలోని అంశాలను ఇంటింటికీ వివరించేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సమాయత్తమవుతున్నాయి. మేనిఫెస్టో హంగు, ఆర్భాటం లేకుండా, వాస్తవికతకు దగ్గరగా, ఆచరణ సాధ్యంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడానికి ఈ మేనిఫెస్టో బాటలు వేస్తుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మేనిఫెస్టోపై పలువురు తమ అభిప్రాయాలను సాక్షితో పంచుకున్నారు. - సాక్షి నెట్‌వర్క్

- అన్ని వర్గాలను సంతృప్తి పరిచేలా వైఎస్సార్‌సీపీ ప్రణాళిక
- వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను స్వాగతిస్తున్న సకల వర్గాలు
- ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు

వందశాతం అమలు చేసే వ్యక్తి వైఎస్ జగన్



నవరత్నాల పథకాల వల్ల పేదల జీవితాల్లో ఎంతో మార్పు వచ్చింది. సాధ్యమయ్యే వాటిని మాత్రమే చెప్పి వాటిని వందశాతం అమలు చేసే వ్యక్తి జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరే. 2019 ఎన్నికలలో మేనిఫెస్టోలో చెప్పనవి 99శాతం అమలు చేయడంతోపాటు సమయానుకూలంగా ప్రజలకు అవసరమైన మరెన్నో పథకాలను అభివృద్ధి కార్యక్రమాలను చేశారు. జగన్ మోహన్ రెడ్డి చెప్పింది చేస్తాడనే నమ్మకం ప్రజల్లో ఉంది. చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో 12 శాతం ఉన్న పేదరికం జగనన్న పాలనలో 3.6 శాతానికి చేరుకుందంటే ప్రజల్లో పెరిగిన అభివృద్ధి కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. ప్రజలను మభ్యపెట్టి ఎలాగైనా అధికారంలోకి రావాలనే లక్ష్యంతో అనంత కోటి హామీలతో చంద్రబాబు వస్తున్నారు. గతంలో డ్వాక్రా, రైతు రుణమాఫీ వంటి 600 హామీలతో మోసం చేసిన విషయాన్ని రాష్ట్ర ప్రజలు ఇంకా మరచిపోలేదు.

–జి శ్రీకాంత్ రెడ్డి, ఎమ్మెల్యే, రాయచోటి

అన్ని వర్గాలకు మేలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు పేజీల మేనిఫెస్టోను ప్రకటించారు. మానవతా దృక్పథం ఇనుమడించింది. అన్ని వర్గాల వారికి అనుకూలమైన మేనిఫెస్టోగా కన్పిస్తోంది. 500 జనాభా ఉన్న గిరిజన గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేస్తామనడం గొప్ప విషయం. అలవికాని హామీల జోలికి వెళ్లలేదు. చేయదగిన వాటినే ప్రకటించారు. జగన్ చెప్పాడంటే చేస్తాడన్న గట్టి నమ్మకం ఉంది. ఐదేళ్లలో 99 శాతం హామీలు నెరవేర్చారు. అక్కచెల్లెమ్మలకు, అవ్వాతాతలకు, రైతులు, మహిళలు, కార్మికులు, యువత, విద్యార్థులకు మెనిఫెస్టోలో సమాన ప్రాధాన్యత కల్పించారు. –జి.శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎంబీఏ విభాగం, మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల, కురబలకోట మండలం

పేదలకు మేలు చేకూర్చే మేనిఫెస్టో



కుల మతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టో ద్వారా మేలు జరుగుతుంది. ప్రకటించిన మేనిఫెస్టోను పూర్తిస్థాయిలో అమలు చేసిన ఏకైన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి. రైతులు, చేనేత కార్మికులు, వృద్ధులు, వాహనదారులకు ఇలా ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరనుంది. - తురక శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, పుల్లంపేట

జనరంజక మేనిఫెస్టో



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టో అన్నివర్గాల వారికి మేలు జరిగే విధంగా జనరంజకంగా ఉంది. జగన్ మేనిఫెస్టోలో చెబితే వాటిని కచ్చితంగా అమలు చేస్తాడని మాకు నమ్మకం ఉంది. 2014లో చంద్రబాబునాయుడు మేనిఫెస్టోలో సాధ్యం కానివి చెప్పి అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటీ సక్రమంగా నెరవేర్చలేదు. అందువల్ల ఆయన ఎన్ని హామీలు ఇచ్చినా ఆయన మాటలను ప్రజలు నమ్మరు. 2024 ఎన్నికల్లో కూడా జగనే సీఎం కావలన్నది మా కోరిక. -సయ్యద్ అబ్దుల్ రసూల్, రైతు, దిగువపేట, సిద్దవటం

అన్ని వర్గాలకు మేలు జరుగుతుంది



అన్ని వర్గాలకు మేలు చేసేలా మేనిఫెస్టో ఉంది. గత ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రకారం ముఖ్యమంత్రి జగనన్న అన్ని హామీలను 99 శాతం అమలు చేసి దేశంలోనే ప్రతి ఒక్క ముఖ్యమంత్రికి ఆదర్శంగా నిలిచారు. ప్రస్తుతం విడుదల చేసిన మేనిఫెస్టో ప్రతి ఒక్క పేదవాడికి, బడుగు బలహీన వర్గాల వారికి మేలు చేసే విధంగా ఉంది. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వ్యక్తిగా జగనన్న చరిత్రలో నిలిచిపోయారు. -కంభంపాటి శ్రీనివాసులరెడ్డి, రాఘవరాజుపురం, రైల్వేకోడూరు మండలం

కరోనా సంక్షోభంలోనూ ఆగని సంక్షేమం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా కరోనా వంటి సంక్షోభంలో కూడా ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేశారు. ఇప్పుడు నూతనంగా ప్రకటించిన మేనిఫెస్టోతో రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు చేకూరుతుంది. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ మేనిఫెస్టో అమలు చేయాలంటే మూడు రాష్ట్రాల బడ్జెట్ కూడా సరిపోదు. ప్రజలు చంద్రబాబును నమ్మే స్థితిలో లేరు. -చిన్నప్ప, మార్కెట్‌యార్డు చైర్మన్, పులివెందుల

జగనన్న చెప్పిందే చేస్తాడు.. చేసేదే చెబుతాడు



జగనన్న మాట తప్పడు.. మడమ తిప్పడు.. అలాగే చెప్పిందే చేస్తాడు.. చేసేదే చెబుతాడు... రైతులకు గత మేనిఫెస్టోలో రూ.12,500 చొప్పున నాలుగేళ్లు ఇస్తానని చెప్పిన జగనన్న రైతులకు అన్ని విధాలా ఉపయోగపడాలన్న ఆశయంతో రూ.1000 పెంచి ఏటా రూ.13,500 చొప్పున ఐదేళ్లు ఇచ్చారు. ఈ మేనిఫెస్టోలో రైతు భరోసా ద్వారా రైతులకు రూ.16వేలు ఇస్తామని జగనన్న ప్రకటించారు.

– సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ప్రభుత్వ ఉద్యాన సలహాదారు, కమలాపురం

ప్రజలకు జగన్‌పై నమ్మకం



ముఖ్యమంత్రి ఏదైతో చెబుతాడో అది ఎంత కష్టతరమైనా సరే చేసి తీరుతాడనే నమ్మకం ప్రజల్లో బలంగా ఉంది. గతంలో చంద్రబాబు రుణమాఫీ అని చెప్పి అధికారంలోకి రాగానే మాట మార్చాడు. అక్కచెల్లెమ్మలకు బంగారు ఇంటికి తెచ్చిస్తా అని చెప్పి మోసం చేశాడు. చివరకు బంగారు అమ్ముకొని బ్యాంకుల్లో అప్పులు తీర్చుకున్నారు. జగన్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాడు. ఈ ఈ మేనిఫెస్టో వల్ల ప్రజలు మరింత ఆర్థిక పరిపుష్టి పొందే అవకాశం ఉంది. -కొవ్వూరు మునిరత్నంరెడ్డి, చక్రాయపేట

అన్ని వర్గాలకు మేలు జరిగేలా ఉంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన మేనిఫెస్టో నిజమైనది. అన్ని వర్గాలకు తిరిగి మరోసారి మేలు చేకూర్చేలా ఉండటం అభినందనీయం. ముఖ్యంగా ఈ రాష్ట్రంలో కాపు నేస్తం రూ.60వేల నుంచి 1.20 లక్షలకు పెంచనుండటం హర్షణీయం. నవరత్నాలను మరింత మెరుగ్గా అమలుచేసే విధంగా మేనిఫెస్టో రూపకల్పన అద్భుతంగా ఉంది. ప్రస్తుతం మేనిఫెస్టోలో ఉన్న నవరత్నాలను 99శాతం అమలు చేసిన సీఎం జగన్‌లా దేశంలో ఎవరూ లేరు. ఇది ఒక రికార్డు.

–మేడా రఘునాథరెడ్డి, రాజ్యసభ సభ్యుడు, రాజంపేట

బాబు మేనిఫెస్టో బోగస్



చంద్రబాబు మేనిఫెస్టో అంతా బోగస్. అది మేనిఫెస్టో కాదు. ఎన్నికల్లో ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు నోటికి వచ్చింది చెబుతుంటాడు. గత ఎన్నికల్లో కూడా బాబు మేనిఫెస్టో అమలు చేయలేదని ప్రజలందరికి తెలుసు. అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టోను మరిచిపోవడం బాబు నైజం. అదే సీఎం వైఎస్ జగన్ మేనిఫెస్టోలో చెప్పిన వాటిని పూర్తిగా అమలుచేశారు. మళ్లీ అదేరీతిలో పేదవర్గాలకు మేలు జరిగేలా మేనిఫెస్టోను తీసుకొచ్చారు. –ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి, రాజంపేట

నేతన్నకు తోడుగా నేతన్న నేస్తం



వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కొనసాగిస్తామని మేనిఫెస్టోలో చెప్పడం నేతన్నలకు ఊరటనిచ్చింది. ఐదేళ్లలో క్రమం తప్పకుండా ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నేతన్నకు ఈ పథకం వరం. సీఎం జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం అభినందనీయం. -జి.సుధాకర్, చేనేత జనసమాఖ్య అధ్యక్షుడు,మదనపల్లె

న్యూస్‌రీల్

ఆర్డీఓ కార్యాలయాన్ని పరిశీలించిన ఎన్నికల అధికారి



రికార్డులను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి

జమ్మలమడుగు: కడప పార్లమెంట్ పరిధిలో జమ, ఖర్చు పద్దు ఎన్నికల పరిశీలనాధికారి రాజేష్ భారతి ఆర్డీఓ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల ఖర్చులకు సంబంధించిన వివరాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్, కార్యాలయ ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు కడప నగరంలో ఏపీసెట్ - 2024



ఆచార్య పి.ఎస్. షావల్లీఖాన్

వైవీయూ: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఏపీసెట్)–2024 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని యోగివేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు, ఏపీసెట్ ప్రాంతీయ సమన్వయకర్త ఆచార్య పి.ఎస్.షావల్లీఖాన్ వెల్లడించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ లెక్చరర్ పోస్టులకు, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హతను నిర్ణయించే ఏపీసెట్ ను ఈనెల 28వ తేదీ ఆదివారం కడప నగరంలోని 8 కేంద్రాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షకు 2,500 అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. యోగివేమన విశ్వవిద్యాలయం, గవర్నమెంటు డిగ్రీ కాలేజి ఫర్ మెన్, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ గవర్నమెంటు డిగ్రీ కాలేజి ఫర్ ఉమన్, ఎస్వీ కాలేజి ఫర్ ఇంజినీరింగ్, నాగార్జున డిగ్రీ అండ్ పీజీ కాలేజి ఫర్ ఉమన్, శ్రీ వివేకానంద డిగ్రీ అండ్ పీజీ కాలేజి ఫర్ ఉమన్, శ్రీహరి డిగ్రీ అండ్ పీజీ కాలేజి, విద్యాసాధన డిగ్రీ కాలేజీలను కేంద్రాలుగా నిర్ణయించామన్నారు. పరీక్ష పర్యవేక్షణకు ప్రతి కేంద్రానికి విశ్వవిద్యాలయం నుంచి అబ్జర్వర్లను నియమించామన్నారు. ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభ సమయానికంటే గంట ముందే కేంద్రాలకు హాజరుకావాలన్నారు. నిర్ణీత సమయం కంటే నిమిషం ఆలస్యం అయినా పరీక్షా కేంద్రంలోకి అనుమతించేదిలేదన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలన్నారు.

ప్రాజెక్టులకు ప్రాణం

- శరవేగంగా సాగుతున్న పనులు
- జీఎన్ఎస్ఎస్, తెలుగుగంగ ప్రాజెక్టులకు రూ. 3500 కోట్ల వ్యయం
- ఆయకట్టు పెంపునకు ప్రత్యేక కృషి



గండికోట ప్రాజెక్టు

కడప సిటీ: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఉన్న ఆయా ప్రాజెక్టుల పెండింగ్ పనులను శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జీఎన్ఎస్ఎస్, తెలుగుగంగ, ఇంకా పలు ప్రాజెక్టుల పెండింగ్ పనులకు రూ. 3500 కోట్లు కేటాయించింది. ఆయకట్టు పెంపునకు కృషి చేస్తోంది. ఇదే కాకుండా కరువు నివారణ పథకం కింద ఆయా ఎత్తిపోతల పథకాలు కూడా చేపట్టింది.

జీఎన్ఎస్ఎస్ కింద..

గాలేరు–నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్) పథకం కింద 1, 2, 3 ప్యాకేజీ పనులకు సంబంధించి పనులు జరుగుతున్నాయి. ఇందుకోసం 2020–23లో రూ. 1345 కోట్లకు టెండర్లు పిలిచి పనులు చేపట్టారు. ఇందులో మొదటి ప్యాకేజీకి రూ. 310 కోట్లు అంచనా వ్యయం కాగా రూ. 210 కోట్లు, రెండో ప్యాకేజీకి రూ. 510 కోట్లు కాగా రూ. 470 కోట్లు, మూడో ప్యాకేజీకి సంబంధిందించి రూ. 520 కోట్లు కాగా రూ. 160 కోట్లు ఖర్చు చేశారు. మొత్తం 1345 కోట్ల అంచనా వ్యయానికి ఇప్పటివరకు రూ. 840 కోట్ల విలువైన పనులను ప్రభుత్వం పూర్తి చేసింది. 0 నుంచి 75 కిలోమీటర్ల వరకు కెనాల్ పనులు పూర్తయ్యాయి. మిగతా డిస్ట్రిబ్యూటరీ పనులు కొనసాగుతున్నాయి. సర్వరాయసాగర్, వామికొండ ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ పనులకు రూ. 212 కోట్లతో టెండర్లు పిలిచారు. 35 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లిచ్చేందుకు చర్యలు చేపట్టారు. టీడీపీ హయాంలో అరకొర నిధులు మాత్రమే కేటాయించారు. అంతేకాకుండా సర్వరాయసాగర్ ప్రాజెక్టు 0.5 టీఎంసీలు నీటిని మాత్రమే టీడీపీ ఉంచగా, ఈ ప్రభుత్వం 1.65 టీఎంసీల నీటితో నింపింది.

కాలేటి వాగుకు రూ. 250 కోట్లు

జీఎన్ఎస్ఎస్ నుంచి ఎత్తిపోతల ద్వారా కాలేటి వాగుకు నీటిని తరలించే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం రూ. 250 కోట్లు కేటాయించింది. 90 శాతం పనులు పూర్తయ్యాయి. 0.2 టీఎంసీల నుంచి 1.2 టీఎంసీలు పెంచాలని నిర్ణయించారు. ఈ పనులు పూర్తయితే 39 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందడమే కాకుండా లక్ష మందికి తాగునీరు అందేందుకు అవకాశం ఏర్పడుతుంది. చక్రాయపేట, రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాల పరిధిలోని 133 చెరువులకు నీళ్లు నింపేందుకు అవకాశం ఉంటుంది.

ప్రాజెక్టు పనులను విస్మరించిన టీడీపీ

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని ప్రాజెక్టు పనులను గత టీడీపీ ప్రభుత్వం విస్మరించడంతోనే అభివృద్ధి కుంటుపడింది. ప్రస్తుత ప్రభుత్వం ప్రాజెక్టుల పెండింగ్ పనులకు శ్రీకారం చుట్టింది. పింఛా ప్రాజెక్టుకు సంబంధించి రూ. 60 కోట్లతో పనులు చేపడుతున్నారు. బండ్ వాల్, స్పిల్‌వే పనులు, గేట్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. జులై నాటికి పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు. అన్నమయ్య ప్రాజెక్టుకు సంబంధించి రూ. 550 కోట్లతో పనులు చేపట్టేందుకు టెండర్లు పూర్తి కాగా, త్వరలో పనులు జరగనున్నాయి.

జీఎన్ఎస్ఎస్ పనులకు రూ.4300 కోట్లు

జీఎన్ఎస్ఎస్ పనులకు రూ. 4300 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. ఇప్పటికే రూ. 1250 కోట్ల పనులను చేపట్టింది. వైఎస్సార్ జిల్లాకు రూ. 650 కోట్లు, అన్నమయ్య జిల్లాకు రూ. 750 కోట్లు ఖర్చు చేయాలన్నది ప్రధాన ఉద్దేశం. పనులు పూర్తయితే వైఎస్సార్ జిల్లాలో 40 వేల ఎకరాలకు, అన్నమయ్య జిల్లాలో 2.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశాలు ఉన్నాయి. అంతేకాకుండా ఉమ్మడి జిల్లాలో 10 లక్షల మందికి తాగునీరు అందనుంది. లక్కిరెడ్డి పల్లె, రామాపురం మండలాల్లో 90 చెరువులు నింపేందుకు అవకాశం ఉంది. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. 4, 5, 6, 7 ప్యాకేజీలకు సంబంధించి కడప నుంచి రైల్వేకోడూరు వరకు పనులు చేస్తున్నారు. భూ సేకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. అటవీశాఖకు సంబంధించిన అనుమతులు త్వరలో అందనున్నాయని అధికారులు చెబుతున్నారు.

తెరపైకి తెలుగు కాంగ్రెస్!

- వైఎస్సార్‌సీపీ ఓట్లు చీల్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ తీరు
- ముస్లిం మైనార్టీలను టార్గెట్ చేస్తున్న వైనం
- తెలుగుదేశం పార్టీకి లబ్ధి చేకూర్చడమే లక్ష్యం
- కడప, ప్రొద్దుటూరు, రాయచోటిలో టీడీపీకి పరోక్ష సహకారం



సాక్షి ప్రతినిధి, కడప: సార్వత్రిక ఎన్నికల పర్వంలో రాజకీయ పక్షాల అపవిత్ర కలయికలు తెరపైకి వస్తున్నాయి. తాము గెలవడం కంటే తమ ప్రత్యర్థిని ఇబ్బందిపెట్టడమే లక్ష్యంగా రాజకీయ పార్టీల మధ్య అవగాహన కుదురుతోంది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల మధ్య కొనసాగుతున్న మైత్రి ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. తాము ఎటూ గెలవలేం, వైఎస్సార్‌సీపీని నియంత్రించడమే లక్ష్యం కావాలనే దిశగా కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తోంది. అందివచ్చిన అవకాశాన్ని తెలుగుదేశం పార్టీ సద్వినియోగం చేసుకుంటోంది. వెరసి తెలుగు కాంగ్రెస్ రాజకీయాలు జోరుగా నడుస్తున్నాయి.

ప్రజల ముంగిట్లోకి పాలన తీసుకువచ్చాం. క్షేత్రస్థాయిలో ఎంతో అభివృద్ధి చేశాం .. రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాం. మరోమారు అవకాశం ఇవ్వాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటర్లను అభ్యర్థిస్తోంది. తమ పాలనలో లబ్ధి చేకూరి ఉంటేనే ఆశీర్వదించండని ఆ పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సైతం కోరుతున్నారు. చరిత్రలో తన వల్ల మేలు చేకూరి ఉంటే ఓట్లు వేయండనే రాజకీయ నేత ఇంతవరకూ ఎవరూ లేరని ప్రజలు కొనియాడుతున్నారు. పరిస్థితి ఇలా ఉంటే కుట్రలు, కుయుక్తులతో లబ్ధి పొందాలనే వైఖరిని తెలుగుదేశం పార్టీ అవలంబిస్తోంది. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీకి గణనీయంగా పట్టు ఉన్న ఓటర్లలో చీలికలు తెచ్చేందుకు ప్రయత్నిస్తోంది. ప్రధానంగా మైనార్టీ ఓట్లు చీల్చడమే ధ్యేయంగా పావులు కదుపుతున్నారు.

వ్యూహాత్మకంగానే అఫ్జల్‌ఖాన్ అభ్యర్థిత్వం

జిల్లాలో వైఎస్ కుటుంబం అన్నా, వైఎస్సార్‌సీపీ అన్నా పార్టీలకు అతీతంగా ముస్లిం మైనార్టీలు అండగా నిలుస్తూ వస్తున్నారు. గతంలో అనేక ఎన్నికల్లో ఆ విషయం తేటతెల్లమైంది. ఇప్పటికే కడపలో రెండు పర్యాయాలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎస్‌బి అంజద్‌బాషా విజయకేతనం ఎగురవేశారు. ప్రస్తుతం మరోమారు తలపడుతున్నారు. ఈమారు వైఎస్సార్‌సీపీని ఎన్నికల్లో ఎలాగైనా నియంత్రించాలనే లక్ష్యంతో టీడీపీ కుయుక్తులు పన్నుతోంది. ఓవైపు విద్వేషాలు రెచ్చగొడుతూ కుట్ర రాజకీయాలు చేస్తుండగా, మరోవైపు కాంగ్రెస్‌తో చేతులు కలిపింది. వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉన్న ముస్లిం మైనార్టీల ఓట్లు చీల్చేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది. ఆమేరకే కడపలో అఫ్జల్‌ఖాన్‌ను కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో దించారని పరిశీలకులు వెల్లడిస్తున్నారు. అఫ్జల్‌ఖాన్ అభ్యర్థిత్వం ఎంచుకోవడం వెనుక కూడా కారణం లేకపోలేదు. ముస్లిం మైనార్టీలలో పఠాన్ తెగకు చెందిన వారిని తమ వైపు మరల్చుకోవాలనే భావనలో కాంగ్రెస్ పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. ఆమేరకు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఆర్థిక సహకారం అందించేందుకు రహస్య ఒప్పందం కుదిరినట్లు సమాచారం. కడప శివార్లలోని జయరాజ్ గార్డెన్‌లో తెలుగు కాంగ్రెస్ నేతలు సమావేశమై అఫ్జల్‌ఖాన్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు తెలుస్తోంది.

కడప, ప్రొద్దుటూరు, రాయచోటిలలో ఎందుకంటే...

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లిం మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించడంతో ముస్లిం కుటుంబాలకు ఎంతో లబ్ధి చేకూరింది. తద్వారా వైఎస్ కుటుంబానికి అండగా ఉంటున్నారు. కడపలో ముస్లిం మైనార్టీ ఓటర్లు దాదాపు 90వేలు ఉన్నారు. వీరి మద్దతు ఏకపక్షంగా వైఎస్సార్‌సీపీకి కొనసాగుతోంది. మరోవైపు బీజేపీ, జనసేనతో పొత్తు కారణంగా కూడా టీడీపీకి వ్యతిరేకంగా నిలవనున్నట్లు పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో వారి ఓట్లలో చీలిక తీసుకువస్తే ఫలితం తమకు అనుకూలంగా ఉంటుందనే దిశగా టీడీపీ నాయకులు అడుగులు వేశారు. ఆ మేరకు కాంగ్రెస్ పార్టీతో చేతులు కలిపి కడపలో అఫ్జల్‌ఖాన్‌ను కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపిక చేయించారు. ప్రొద్దుటూరు, రాయచోటి నియోజకవర్గాల్లో కూడా ఇదే పంథాను కొనసాగించారు. ప్రొద్దుటూరులో దాదాపు 45వేలు ముస్లిం ఓటర్లు ఉన్నారు. వీరిలో భారీగా చీలికలు తీసుకురావాలనే ఉద్దేశంతో మహమ్మద్ నజీర్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. అలాగే రాయచోటిలో కూడా అల్లాబక్ష్ ఎంపిక వెనుక కూడా టీడీపీకి లబ్ధి చేకూర్చడమే అసలు లక్ష్యమని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. జిల్లాలో ఇలా అవసరమైన మేరకు సహకరించేందుకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డితో నిత్యం పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఫోన్‌లో టచ్‌లో ఉన్నట్లు కూడా పలువురు చెప్పుకొస్తున్నారు. మొత్తానికి జిల్లాలో తెలుగు కాంగ్రెస్ రాజకీయాలు తెర ముందుకు రావడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

మే 4వ తేదీలోపు సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్: ఏపీ ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలలో ఫెయిల్ అయిన అభ్యర్థులు మే 4వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ మర్రెడ్డి అనురాధ, ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 25 రూపాయల అపరాధ రుసుంతో మే 5వ తేదీ నుంచి 6వ తేదీ వరకు, 50 రూపాయల అపరాధ రుసుంతో 7వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. అలాగే తత్కాల్ పద్ధతిలో పదో తరగతికి రూ. 500, ఇంటర్మీడియట్‌కు రూ. 1000తో ఫీజు మే 9వ తేదీ నుంచి 10వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు జూన్ 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్ ప్రవేశ పరీక్ష


పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

రాయచోటి టౌన్ : 10వ తరగతి పరీక్షలు పాస్ అయిన విద్యార్థులకు (పాలిటెక్నికల్) కోర్సులో చేరేందుకు నిర్వహించిన పాలీసెట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. శనివారం నిర్వహించిన అర్హత ప్రవేశ పరీక్షలలో అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె, కలికిరి, రాజంపేట, రాయచోటిలోని పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. రాయచోటిలో ఐదు పరీక్ష కేంద్రాల ద్వారా మొత్తం1252 మంది హాజరు అయ్యారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 4369 మంది హాజరు కాగా వీరిలో బాలురు 2471 మంది, బాలికలు 1898 మంది హాజరయ్యారు. ఈ పరీక్షల నిర్వహణలో సహకరించిన అధికారులకు పాలీ సెట్ జిల్లా కో ఆర్డినేటర్ పి. శివశంకర్ కృతజ్ఞతలు తెలియచేశారు. పరీక్ష కేంద్రాల వద్ద తమ కళాశాలలో చేరాలని వివిధ పాలిటెక్నికల్ కళాశాల యాజమాన్యాలు చిన్నారులతో కరపత్రాలను పంపిణీ చేపట్టింది.

బాలుడి డ్రైవింగ్

– అదుపు తప్పిన టిప్పర్

పులివెందుల రూరల్ : పట్టణంలోని వంకబడి మిట్ట మల్లేశ్వరస్వామి ఆలయ సమీపంలో పార్కింగ్ చేసి ఉన్న టిప్పర్‌ను డ్రైవింగ్ చేసిన బాలుడు (14) బీభత్సం సృష్టించాడు. తాళాలు అలాగే ఉంచడంతో ఆ ప్రాంతంలోని బాలుడు టిప్పర్‌లోకి వెళ్లి స్టార్ట్ చేసి సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాలు, రేకుల షెడ్డులను ఢీకొట్టాడు. అయితే ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.పిల్లలను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని అంటున్నారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వైఎస్సార్ సీపీలో చేరిన యువకులు

వైఎస్సార్‌సీపీలో చేరిన యువకులు

నిమ్మనపల్లె : ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ఆకర్షితులై, శనివారం మండలంలోని నిమ్మనపల్లె, పెద్ద మాదిగ పల్లె, చౌకిళ్లవారి పల్లె, వెంకోజిగారిపల్లె, గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేన పార్టీల నుంచి 40 మంది యువకులు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్ సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి నిసార్ అహ్మద్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పెద్దమాదిగపల్లెకు చెందిన సోము, శోభన్, నారాయణ స్వామి, పిల్ల వెంకటరమణ, నరసింహులు, మంజునాథ్, బాబు, రామయ్య, సురేంద్ర, నరేష్, శ్రీనివాసులు, చౌకిల్లవారిపల్లెకు చెందిన రామమూర్తి, రెడ్డి ప్రసాద్, దేవా, వెంకోజిగారిపల్లె కు చెందిన అశోక్, నిమ్మనపల్లెకు చెందిన మల్లికార్జున రెడ్డి, హమీద్, హజ్జద్, హుస్సేన్ తదితరులు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు చేస్తున్న మంచిని చూసి ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సదాశివరెడ్డి, ఎంపీపీ నరసింహులు, మండల కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, నాయకులు హేమంత్ కుమార్, జాఫర్, దావూద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


నిమ్మనపల్లె : నిస్సార్ అహ్మద్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన యువకులు


ఓబులవారిపల్లె : పార్టీలో చేరిన వారితో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

ఓబులవారిపల్లె మండలంలో..

ఓబులవారిపల్లె : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సమక్షంలో శనివారం టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. బొమ్మవరం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షులు టీ కృష్ణారెడ్డి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ సుంకేసుల రఫీ ఆధ్వర్యంలో చెన్నరాజుపోడుపంచాయతీ సోమకుల పల్లె గ్రామనికి చెందిన బండారు రమణ తదితరులకు, బొమ్మవరం గ్రామనికి చెందిన చక్రవర్తుల శివనాగరాజు తదితరులకు ఎంపీ మిథున్‌రెడ్డి పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జీ గౌరిశంకర్‌రాజు, చిత్తురు జిల్లా జేసీఎస్ కొఆర్డినేటర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ లౌడి గంగురాజు,కాపుసంఘం నాయకులు అంబంటి మురళి తదితరులు పాల్గొన్నారు.

కూటమి పొత్తుకు టీడీపీ తూట్లు


మాట్లాడుతున్న రమేష్‌నాయుడు

రాజంపేట రూరల్ : కూటమి పొత్తు ధర్మానికి రాజంపేటలో టీడీపీ నాయకులు తూట్లు పొడుస్తున్నారని బీజేపీ రాజంపేట, రైల్వేకోడూరు నియోజక వర్గాల ఎన్నికల ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు మండిపడ్డారు. శనివారం ఇక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమిలో భాగంగా రాజంపేట పార్లమెంట్ స్థానానికి బీజేపీ తరపున మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పోటీలో ఉన్నారని తెలియజేశారు. నల్లారి ఫొటోతో కూడిన కరపత్రాలను తాము టీడీపీ అభ్యర్థి సుగవాసికి కార్యాలయానికి అందజేశామన్నారు. అయితే టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం చిత్రంతో కూడిన కరపత్రాలను మాత్రమే ఇంటింటికి అందిస్తూ ప్రచారం చేయటంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

టీడీపీ ప్రచార రథం దగ్ధం

వైఎస్సార్‌సీపీ నేతలు కారణమని విమర్శలు

వాల్మీకిపురం : టీడీపీ ప్రచార రథం దగ్ధమైన సంఘటన మండలంలోని విఠలం సమీపంలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు... టీడీపీ ప్రచార రథం వాల్మీకిపురం పట్టణంలో తిరిగి చింతపర్తి వైపు వెళుతుండగా గుర్తు తెలియని దుండగులు పెట్రోలు పోసి నిప్పంటించారని వాహన డ్రైవరు బాబాచారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదశాత్తు వాహనంలో మంటలు చెలరేగాయా... లేక మరేదైనా కారణం ఉండవచ్చా అని ఆరా తీస్తున్నారు. ఇదే అదునుగా భావించిన టీడీపీ నేత కిశోర్ రెడ్డి సతీమణి సంఘటన స్థలానికి చేరుకుని వైఎస్సార్‌సీపీ నాయకులపై విమర్శలు చేశారు. నిప్పంటించిన వారిని శిక్షించాలని రోడ్డుపై బైటాయించారు. కిశోర్ రెడ్డి సైతం వైఎస్సార్‌సీపీ చర్యగా కార్యకర్తల సమవేశంలో ప్రసంగించారు. కాగా రెండు రోజుల కిందట ఇదే వాహనంలో జనరేటర్ (జనరేటర్‌లో ట్యాంక్ పగిలింది) ప్రమాదానికి గురై వాహనంలోని ఆంప్లిఫయర్ పూర్తిగా కాలిపోయినట్లు సమాచారం. వాహన డ్రైవరు మరమ్మతులు చేయించి శనివారం వాహనాన్ని తిప్పాడు. వాహనంలో ప్రమాదంతోనే మంటలు చెలరేగినట్లు ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు దర్యాప్తు చేపట్టారు, విచారణలో పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.


మంటల్లో టీడీపీ ప్రచార రథం

విచారణ చేపట్టాం

కలికిరి : వాల్మీకిపురం మండలంలో చోటు చేసుకున్న ఓ పార్టీ ప్రచార రథం దగ్ధం ఘటనకు సంబంధించి వివిధ కోణాల్లో విచారణ జరుపుతున్నట్లు డీఎస్పీ సయ్యద్ మహబూబ్ బాషా అన్నారు. కలికిరిలో ఆయన మాట్లాడుతూ ఘటనకు సంబంధించి వాహన డ్రైవరు చింతపర్తికి చెందిన బాబాచారి నుంచి ఫిర్యాదు అందిందని, వాల్మీకిపురం స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు డీఎస్పీ చెప్పారు.

గుర్తుతెలియని వ్యక్తుల దాడి : వ్యక్తికి తీవ్రగాయాలు


రక్తపు మడుగులో పడి ఉన్న మౌలాలి

ఒంటిమిట్ట : మండల పరిధిలోని సాలాబాద్ గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వెనుక వైపు ఉన్న క్రికెట్ గ్రాండ్‌లో శనివారం తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో కొన ఊపిరితో కొట్టు మిట్టాడుతున్న వ్యక్తిని స్థానికులు గుర్తించారు. పోలీసుల కథనం మేరకు..సిద్దవటం మండలం, ఎగువపేట బీసీ కాలనీకి చెందిన షేక్ మౌలాలి(35)కి 12 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం జరిగింది. ఇతనికి భార్య మల్లీశ్వరి, ఇద్దరు సంతానం ఉన్నారు. ఎగువపేట మాదిగ వాడకు చెందిన మల్లేశ్వరి ఆరు సంవత్సరాల నుంచి కలిసి ఉండటం లేదు. ఇది ఇలా ఉండగా శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మౌలాలి మెడపై తీవ్రంగా గాయపరచి పరారయ్యారు. శనివారం ఉదయం అటువైపు వెళుతున్న స్థానికులు కొన ఊపిరితో ఉన్న మౌలాలిని గమనించి వెంటనే 108కు, పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిని వ్యక్తిని పరిశీలించారు. 108 సహాయంతో కడప రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు.

దిగజారుడు రాజకీయాలు వైఎస్సార్‌సీపీ నైజం కాదు

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : దిగజారుడు రాజకీయాలు వైఎస్సార్‌సీపీ నైజం కాదని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం ఇక్కడ విలేకరులతో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రచార రథం కాలిపోయిన సంఘటన గురించి వాస్తవాలు తెలుసుకోకుండా వైఎస్సార్‌సీపీ నేతలపై నిందలు వేయడం సమంజసం కాదన్నారు. ఈ సంఘటనపై పోలీస్ యంత్రాంగం సమగ్ర విచారణ జరిపి నిగ్గు తేల్చాలని, ప్రమాద సమయంలో ప్రత్యేక్ష సాక్షిగా ఉన్న డ్రైవర్‌ను విచారిస్తే కారకులు, కారణాలు తెలుస్తాయన్నారు. వైఎస్సార్‌సీపీ హింసాయుత రాజకీయాలను ప్రోత్సహించదన్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రచార వాహనాన్ని రాకుండా అడ్డుకుంది టీడీపీ వాళ్లుకాదా అని ప్రశ్నించారు. టీడీప ప్రచార రథం కాలిపోయిన సంఘటన గురించి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, తనపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ సంఘటనను ప్రస్తావిస్తూ టీడీపీ అభ్యర్థి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మగతనాన్ని గురించి మాట్లాడడం హేయంగా ఉందన్నారు. ఎవరి మగతనం ఏమిటో మే 13న జరిగే ఎన్నికల్లో ప్రజలే నిర్ణయిస్తారన్నారు.ఈఘటనలో తనకు,పార్టీ నాయకులు, శ్రేణులకు సంబంధం లేదని తరిగొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బలిపీఠం వద్ద ప్రమాణానికి తాను సిద్ధమని,నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి సిద్ధమా అని ప్రశ్నించారు.ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, సింగల్ విండో అధ్యక్షులు శ్రీధర్‌రాయల్, మండల పార్టీ అధ్యక్షులు నీళ్ళభాస్కర్, ఉపసర్పంచ్ కేశవరెడ్డి, నాయకులు చింతల ఆనంద రెడ్డి, రాయుడు, ఆనంద, మదనమోహన్ రెడ్డి, రమేష్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

దేవుడి సొమ్ముకు లెక్కలు పక్కాగా ఉండాలి

కడప కల్చరల్ : దేవునిసొమ్ముకు లెక్కలు పక్కాగా ఉండేలా సంబంధిత అధికారులంతా చర్యలు చేపట్టాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ అన్నారు. రాయలసీమ జోన్ దేవదాయశాఖ ఈఓలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు, ఉద్యోగుల విస్తృతస్థాయి సమావేశం శనివారం కడపలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ అధికారులు తమ పరిధిలోని 6ఏ–బి తదితర దేవాలయాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని కలిగి ఉండాలని సూచించారు. ఆలయాల ఆస్తులు, వాటి రిజిస్ట్రేషన్ వివరాలు, పబ్లికేషన్,దేవునికి సంబంధించిన నగలు, ఇతర ఆస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన విషయాల గురించి సంబంధిత ఈఓలు, ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ కమిషనర్ల వద్ద సమా చారం ఉండేలా చూసుకోవాలన్నారు. జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ మాట్లాడుతూ ఆలయాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు సరిచూసుకుంటూ పై అధికారులకు చేర్చాలన్నారు. అడిషనల్ కమిషనర్ కె.రామచంద్రమోహన్ మాట్లాడుతూ పలు ఆలయాలకు సంబంధించిన స్థిర చరాస్తుల,గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మూడు సంవత్సరాలకు సంబంధించి డేటాను సేకరించారు. డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీలు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.


మాట్లాడుతున్న రాష్ట్ర దేవదాయ ధర్మదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ

నిత్యం ప్రజల్లోనే ఉన్నాం.. గెలిపించండి

మేమంతా సిద్ధం సభలో ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి


యల్లాయపల్లె గ్రామంలో జగన్ కోసం మేమంతా సిద్ధం సభలో మాట్లాడుతున్న రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి

ఓబులవారిపల్లె : ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, ప్రజల్లో తిరుగుతున్నామని, మరోసారి రాజంపేట ఎంపీగా తనను, రైల్వేకోడూరు ఎమ్మెల్యేగా కొరముట్ల శ్రీనివాసులను రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి గెలిపించాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ప్రజలను కోరారు. శనివారం బొమ్మవరం, యల్లాయపల్లె పంచాయతీలలో నిర్వహించిన జగన్ కోసం మేమంతా సిద్ధం బహిరంగ సభ కార్యక్రమానికి రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి గత పది సంవత్సరాలుగా నియోజకవర్గంలో ఎక్కడైనా ప్రజలకు కనిపించారా అని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్, నల్లారిలు హైదరాబాదులో ఉంటూ ఎన్నికలప్పుడు మాత్రమే వచ్చి వెళ్లిపోతారన్నారు. వలస పక్షులకు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. పవన్ కళ్యాణ్ రైల్వేకోడూరులో కులాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం, ఊగిపోవడం ఏమిటని ప్రశ్నించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ సంక్షేమ పథకాలతో పేదవాడికి అందించి అండగా నిలుస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీని ఆదరించి, ఆ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీడీపీ గెలుస్తే సంక్షేమ పథకాలు అన్నీ రద్దు అవుతాయని హెచ్చరించారు. ఎలాగైనా అధికారంలోకి రావాలని చంద్రబాబు అసాధ్యమైనా హామీలను ఇస్తున్నారని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వైఎస్సార్ సీపీకి మేనిఫెస్టో ఖురాన్, బైబిల్, భగవద్గీతతో సమానమన్నారు. చెప్పినవి ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు. ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి మాట్లాడుతూ ఎంపీ మిథున్ రెడ్డి చరిత్ర సృష్టించబోతున్నారని అన్నారు. గతంలో ఇద్దరు కేంద్ర మంత్రులను ఓడించి ఎంపీగా గెలిచారని, ప్రస్తుతం బరిలో ఉన్న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డిని ఓడించి హ్యాట్రిక్ సాధించబోతున్నారని జోస్యం పలికారు. అంతకుముందు బొమ్మవరం గ్రామంలో వైస్ ఎంపీపీ జి.గౌరీశంకర్ రాజు, యల్లాయపల్లె గ్రామంలో సర్పంచ్ జి.నారాయణ రెడ్డిలు ఎంపీ మిథున్ రెడ్డికి ఘనంగా గజమాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు హేమనవర్మ, సీనియర్ నాయకులు కొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, జి.హరినాథ్ రెడ్డి, ఎంఎస్ఆర్, పి.సుబ్బరాయుడు, డి.చెంగల్ రెడ్డి, ఎం.వెంకటసుబ్బారెడ్డి, టి.భరత్ కుమార్ రెడ్డి, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

పుల్లంపేట : ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పుల్లంపేట మండలంలోని ఎస్వీ కళ్యాణ మండపంలో ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి రైల్వేకోడూరు శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు, రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతి ఒక్క కార్యకర్తకు అండగా ఉంటామని, ఎవ్వరూ అధైర్యపడవద్దన్నారు. 2024లో తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే వత్తలూరు రిజర్వాయర్‌ను ఏర్పాటుచేసి పుల్లంపేట,ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు, పెనగలూరు మండలాలకు తాగునీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లను కూడా పూర్తిచేస్తామన్నారు. ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలోని అంశాలను 99 శాతం అమలు చేశారన్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరిందని కావున ప్రతి ఒక్క కార్యకర్త కలిసి కట్టుగా పనిచేసి ఈ సారి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి మాట్లాడుతూ కొంతమంది స్వార్థపరులు మాపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. మొన్న కోడూరులో జరిగిన మీటింగ్‌లో పవన్‌కళ్యాణ్ కొల్లం గంగిరెడ్డి కుటుంబంపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. తాము నియోజకవర్గంలో ఎవరినైనా బెదిరించినా, వారి సొత్తు దోచుకున్నామని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ముద్దా రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ రామనాదం, మండల కన్వీనర్ ముస్తాక్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి తురక శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, శంకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రంగారెడ్డి, కుమార్ రెడ్డి, డికె.మణి, రాజారెడ్డి, రామిరెడ్డి, సుదీర్ రెడ్డి, తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, చుక్కారెడ్డి, రిజ్వాన్, చంగయ్య, రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వంలో దళిత క్రిస్టియన్‌లపై దాడులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మోదీ ప్రభుత్వంలో ఆదివాసీలు, గిరిజనులు, దళిత క్రిస్టియన్‌లపై దాడులు పెరిగాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వరయ్య పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో క్రైస్తవులకు రక్షణ కొరవడిందని, మళ్లీ ఎన్డీఏ ప్రభుత్వ వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. మోదీ నియంతృత్వ విధానం వల్ల పరమత స్వేచ్ఛకు విఘాతం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండిపెండెంట్ పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు రెవరెండ్ మల్లెం విజయభాస్కర్ మాట్లాడుతూ మత ప్రచారం పేరుతో పాస్టర్‌లపై అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. కాంగ్రెస్‌పార్టీ పార్లమెంటు అభ్యర్థిగా పోటీచేస్తున్న వైఎస్ షర్మిలకు ఇండిపెండెంట్ పాస్టర్ అసోసియేషన్ మద్దతు ఇస్తోందన్నారు. పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు బిషప్ సంతోష్‌కుమార్, ప్రభుదాస్, లాజర్, కిషోర్, డేవిడ్, ఇమ్మానుయేలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఈశ్వరయ్య, విజయభాస్కర్

విధుల్లో నిర్లక్ష్యం

– కానిస్టేబుల్ సస్పెన్షన్

కడప అర్బన్ : జిల్లాలోని సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాతపల్లి క్రాస్ వద్ద చెక్‌పోస్ట్ విధుల్లో నిర్లక్ష్యం వహించిన కానిస్టేబుల్ కె. శివప్రసాద్ (పి.సి. 2825)ను సస్పెండ్ చేశారు. ఈమేరకు జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కానిస్టేబుల్ క్రమశిక్షణ ఉల్లంఘించి మద్యం తాగి విధులకు హాజరైనట్లు ప్రాథమిక విచారణలో వెల్లడి కావడంతో జిల్లా ఎస్పీ సస్పెన్షన్ వేటు వేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కడప అర్బన్ : కడప నగరంలోని తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో కడప– రాయచోటి రహదారిలో ఊటుకూరు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. రాయచోటి వైపు నుంచి కడప వస్తున్న ఓ టిప్పర్‌ను రోడ్డులో ఎలాంటి జాగ్రత్తలను తీసుకోకుండా నిలిపివేశాడు. కడప నగరం అక్కాయపల్లెకు చెందిన శివనాగరాజు(23), అశోక్‌కుమార్ రాజు (24) స్కూటీపై ఊటుకూరు వైపు నుంచి వచ్చి అదుపుతప్పి టిప్పర్ కిందకు వెళ్లిపోయారు. దీంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే స్థానికులు రిమ్స్‌కు తరలించారు. తరువాత మెరుగైన చికిత్సకోసం కడప నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ సంఘటనపై ఏఎస్ఐ వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

కేజీ పీజీసెట్ విజయవంతం

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని కేఎస్ఆర్ఎం మేనేజ్‌మెంట్ స్టడీస్ కళాశాల వారి ఆధ్వర్యంలో డిగ్రీ ఉత్తీర్ణులై పోస్టు గ్రాడ్యుయేట్ చేయాలనే ఆశావహులకు శనివారం నిర్వహించిన కేజీ పీజీ సెట్ 2కే24 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉమ్మడి జిల్లాల నుంచి 500 మంది విద్యార్థులు హాజరయ్యారని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగమణి తెలిపారు.ఈ పరీక్షలో టాప్ ర్యాంకు సాధించిన విద్యార్థులకు ఉచిత అడ్మిషన్ కల్పిస్తామన్నారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నాగరాజు, కేజీపీజీ సెట్ 2కే24 కన్వీనర్ డాక్టర్ నరేష్‌బాబు పాల్గొన్నారు.

మామిడి, కొబ్బరి చెట్లు దగ్ధం

వల్లూరు : వల్లూరు మండల పరిధిలోని పెద్దపుత్త గ్రామ పొలాల్లో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మామిడి, కొబ్బరి చెట్లు దగ్ధమయ్యాయి. మాచిరెడ్డిపల్లెకు చెందిన తాడిగొట్ల వెంకటసుబ్బారెడ్డి పెద్దపుత్త గ్రామ పొలాల్లో ఏడున్నర ఎకరాల్లో మామిడి, కొబ్బరి తోట సాగు చేశాడు. తోట మీదుగా వెళుతున్న 11 కేవీ విద్యుత్ లైన్లు శుక్రవారం తెగి కింద పడ్డాయి. దీంతో మంటలు రేగి తోటంతా వ్యాపించాయి. ఈ ప్రమాదంలో 150 కొబ్బరి, 120 మామిడి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు 3 లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.